క్లుప్తంగా

నేడు అల్లూరి జయంతి

కాకినాడ సిటీ: అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని మంగళవారం ఉదయం 9 గంటలకు నాగమల్లితోట జంక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు సోమవారం తెలిపాయి. జిల్లా కలెక్టర్, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నాయి.

నాటక పోటీలు విజయవంతం చేయండి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన కమిటీ నాటక పోటీలు నిర్వహించనున్నారు. వీటిని విజయవంతం చేయాలని పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని క్షత్రియ పరిషత్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం నాటక పోటీల బ్రోచర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కె.అచ్యుత రామారెడ్డి, జి.సత్యమూర్తి పాల్గొన్నారు.

6న ఉడిపి స్వామీజీ రాక

బోట్‌క్లబ్: భారత్ పరిక్రమ యాత్రలో భాగంగా జగత్‌గురు మధ్వాచార్య మూల సంస్థాన ఉడిపి పుత్తిగ మఠ స్వామీజీ సుగుణేంద్ర తీర్థ 6న కాకినాడ నగరానికి వస్తున్నట్లు రాఘవేంద్ర స్వామి బృందావన సమితి ప్రతినిధి వెంకటేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నగరంలో స్వామి ఉంటారన్నారు. 6న సాయంత్రం 5 గంటలకు నగరానికి చేరుకునే స్వామీజీకి ఘనంగా స్వాగతం పలుకుతామన్నారు. రాత్రి ఏడు గంటలకు సంస్థాన పూజ రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణంలో చేస్తారన్నారు. 7న ఉదయం పీఠపూజ జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి మండల, డివిజనల్ స్థాయిలో వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సోమవారం స్థానికంగా డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి ధ్రువపత్రాల మంజూరుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పాతంశెట్టి నారాయణమూర్తి, ఏబీసీడబ్ల్యూఓ ప్రసాద్, సాంఘిక, సంక్షేమ, పంచాయతీ రాజ్, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటే విజయం



మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్

బోట్‌క్లబ్: ఐక్యంగా ఉంటే అన్నింటా విజయం సాధించవచ్చని బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొల్లంగి శ్రీధర్ అన్నారు. సోమవారం కాకినాడలో జిల్లా బీసీ ఉద్యోగుల సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు తమ సమస్యలను తెలిపాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ కాకినాడ, అమలాపురం జిల్లాలకు కమిటీలు వేశామన్నారు. రిటైర్డ్ మెజిస్ట్రేట్ దొమ్మేటి సుధాకర్ జిల్లా సంఘం చేసే కార్యక్రమాలను అభినందించారు. ఆగస్టు 6న కాకినాడ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారానికి సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘ కార్యవర్గ సభ్యులు కె.రామానుజన్ శ్రీనివాస్, కె.నాగరాజు, గంటి రాధాకృష్ణ, వాసంశెట్టి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 'స్పందన'

కాకినాడ సిటీ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల స్పందన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు, స్మార్ట్ సిటీ ఎస్ఈ సత్యకుమారి, కె.హరిదాస్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ మహేష్‌కుమార్ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐదుగురు నిందితుల అరెస్ట్

కరప: వేళంగి వద్ద ఐదుగురు కోళ్ల దొంగలను కరప పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వేములవాడకు చెందిన కాళ్ల వెంకట మహేశ్వరరావు కోళ్ల ఫారమ్ నుంచి మే 21న 29 కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే నెలలో 30న వేళంగిలోని పోతూరి సూర్యప్రకాష్‌కు చెందిన ఎనిమిది కోళ్లు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ నాడు రామకృష్ణ కేసులు నమోదు చేశారు. సోమవారం వేళంగి సమీపంలో ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా పట్టుపడ్డారు. వారిని విచారించగా పై రెండు చోరీల గుట్టు వీడింది. నిందితుల్లో కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన పెమ్మిరెడ్డి బాలవెంకట్, కె.గంగవరానికి చెందిన కర్రి సత్యనారాయణ, కోటిపల్లికి చెందిన దొక్కాడి ఈశ్వర్‌ప్రసాద్, పెదతాళ్లపాలేనికి చెందిన పంపన దుర్గాప్రసాద్, చొల్లంగిపేటకు చెందిన 16 ఏళ్ల బాలుడు ఉన్నారు.

భక్తికి సాయే.. ముక్తికి సాయే..

- వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: సాయి శరణం.. బాబా శరణం అంటూ ఆ పండరి నాథుడిని భక్తులు కొలిచారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పేర్రాజుపేట సాయిబాబా ఆలయంలో బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు రమణ, కె.రాంగోపాల్, ఎస్‌వీ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సాయిబాబాకు, దత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేక పల్లకిలో సాయిబాబా, దత్తాత్రేయ స్వామిని ఊరేగించారు. అనంతరం ఆలయంలో సాయిబాబా పారాయణ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అశోక్‌నగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో చంద్రాభట్ల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో ఏకవార మహారుద్రాభిషేకం, లక్ష్మీగణపతి, బాబా దత్తాత్రేయ మూల మంత్ర హోమం, ఆయుష్య హోమం, మహాపూర్ణాహుతి చేపట్టారు. అనంతరం గురు చరిత్ర, అఖండ పారాయణ, బాబాహారతి, దత్తాత్రేయస్వామి వారికి శత కలశ రుద్రాభిషేకం చేశారు. బాబావారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్చుత రామారావు ఏర్పాట్లు చేశారు. టూటౌన్ సాయిబాబా ఆలయంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన జరిగింది. సాలిపేటలో బాబావారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎన్ఎఫ్‌సీఓల్ రోడ్డులోని సాయిబాబా ఆలయం, సాంబమూర్తినగర్ సాయిబాబా ఆలయంతో పాటు నగరంలో పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భాస్కర్‌నగర్, పెద్ద మార్కెట్‌లో సాయిబాబా ఆలయాలు, దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.



పేర్రాజుపేటలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



వాకలపూడి సంతోష్‌నగర్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

జ్ఞానమార్గం చూపేది గురువే

కాకినాడ రూరల్: జ్ఞానమార్గం చూపేది గురువు మాత్రమేనని ప్రముఖ యోగా గురువు సచ్చిదానంద యోగి అన్నారు. వాకలపూడి సంతోష్‌నగర్‌లోని రెండు సాయిబాబా ఆలయాల్లో గురుపూజోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొని సాయినాథునికి హారతి ఇచ్చారు. సాయిబాబా, దత్తాత్రేయ ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తిమ్మాపురం ప్రజ్ఞ ఫంక్షన్ హాలులో ఆధ్యాత్మిక విశ్వగురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీగురు విశ్వ స్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబ సభ్యులు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథి సచ్చిదానంద యోగి మాట్లాడుతూ మానవ జీవితం ముక్తి మార్గంలో నడవడానికి స్వచ్ఛమైన గురువు సూచనలు ఆచరించాలన్నారు. నన్నయ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ పాల్గొనగా చిన్నారి త్రినయని తన నృత్యంతో అలరించింది. స్ఫూర్తి మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివ, రంగరాయ మెడికల్ కళాశాల సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ నాజీయ ఫరా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరప మండలంలో..

కరప: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని షిరిడీ సాయి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడ, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లోని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురజనాపల్లిలో ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో ఉదయం కాకడహారతి, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయం వద్ద మహిళలు సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరించారు. సిరిపురంలో ఆలయ వ్యవస్థాపకుడు చిక్కాల దొరబాబు ఆధ్వర్యంలో అర్చకుడు రామం విశేష పూజలు చేశారు. నడకుదురులో సాయిబాబాకు క్షీరాభిషేకం, కాకడ హారతి జరిగింది. వేళంగిలో ఆలయ వ్యవస్థాపకులు సాయి సేవక్‌లతో కాకడ హారతి, సుప్రభాతసేవ, అభిషేకాలు చేశారు. కరప, కొంగోడులోని సాయి మందిరాల్లో సామూహిక వ్రతాలు జరిగాయి.



రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సాయిబాబా వారి ఊరేగింపు



తిమ్మాపురం ప్రజ్ఞ ఫంక్షన్ హాలులో శ్రీవిశ్వ స్ఫూర్తిని దర్శించుకుంటున్న యోగా గురువు సదాశివ



గురజనాపల్లిలో సత్యసాయి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

ముగ్గురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కారుణ్య నియామకం కింద ముగ్గురికి కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. కడియపులంక పశుసంవర్ధక శాఖలో పని చేస్తూ మరణించిన వాసంశెట్టి శ్రీనివాస్ భార్య నీలగంగాభవానికి సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. తొండంగి మండలం సీతారామపురంలో సర్వే గ్రేడ్–3గా పనిచేస్తున్న ములసా లక్ష్మి మరణించడంతో ఆమె సోదరుడు ములసా అబ్రహాంకు సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా, కె.గంగవరం మండలం పానింగిపల్లి వీఆర్వో గ్రేడ్–1గా పనిచేస్తూ పెందుర్తి బాబూరావు మృతిచెందగా అతని కుమారుడికి రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఆఫీసు సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

భారతీయ క్రైస్తవ దినోత్సవం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ సువర్ణరాజు మాట్లాడుతూ దేశంలో అన్నితెగల క్రైస్తవులు మొదటి భారతీయ క్రైస్తవ దినోత్సవం జరుపుకొంటారన్నారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, అల్లం కుమార్‌రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే..



శాకంబరిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



కరపలో శాకంబరిగా ఉప్పాలమ్మతల్లి

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరించారు. ఐదు టన్నుల కూరగాయలతో ఆలయ పరిసరాలను ఎంతో అందంగా అలంకరించారు. వంకాయలు, బెండకాయలు, క్యాప్సికం, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూరతో పాటు వివిధ రకాల పండ్లతో గర్భాలయాన్ని తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 200 మంది భక్తులు సహాయంతో ఆలయాన్ని అందంగా అలంకరించినట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారికి కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. దేవదాయశాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి, కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ కర్రి చిన్నబాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పెద్ది రత్నాజీ, నాయకులు సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉప్పాలమ్మ తల్లికి..

కరప: స్థానిక దేవత ఉప్పాలమ్మతల్లి సోమవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అధికసంఖ్యలో మహిళలు తరలివచ్చి అర్చకుడు విలపర్తి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. భక్తులకు మంగ పరమేశ్వరరావు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీపాదం మురళీకృష్ణ, గొర్రెల శ్రీనివాస్, నక్కా సత్యప్రసాద్, దేవు వీరబాబు, సీహెచ్ రాంబాబు, జి.త్రిమూర్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆలయం చుట్టూ వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు దంపతులు మొక్కలు నాటారు.

సచివాలయాలతో సత్వర సేవలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో గడప గడపకూ..

కాకినాడ రూరల్: సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం ఇంద్రపాలెం సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రజక వీధి, పోస్టాఫీసు వీధి, గోశాల వీధి తదితర ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. నాలుగేళ్లుగా అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, మత్స్యకార భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రతి నెలా ఇంటి వద్దే పింఛన్ సొమ్మును లబ్ధిదారులు అందుకుంటున్నారని అన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, ఇళ్ల స్థలాలు, విద్యుత్ తదితర సమస్యలను ప్రజలు తెలపడంతో వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఎంపీడీఓ కర్రే స్వప్న, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, నాయకులు గోపుశెట్టి బాబ్జీ, పలివెల శ్రీను, మాధవ్, మనోహర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

కరప: అరట్లకట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోపి గణేష్ గుండె సమస్యతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం రాత్రి ఆసుపత్రికెళ్లి గణేష్, భార్య, అరట్లకట్ట గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణిలను పలకరించి ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు ఉన్నారు.

ప్లాస్టిక్ సంచులతో పెనుముప్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సుశీ



వస్త్ర సంచులను పంపిణీ చేస్తున్న అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: చిన్న దుకాణాల నుంచి షాపింగ్ మాల్స్ వరకూ ప్రతిచోటా ప్లాస్టిక్ సంచుల వినియోగంతో అనేక అనర్థాలకు దారి తీస్తుందని ధరిత్రి రక్షణ సమితి అధ్యక్షురాలు ఎస్.సురేఖ తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను సురేఖ వివరించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ పత్తితో తయారైన సంచులు పంపిణీ చేశారు. చింతపల్లి సుబ్బారావు, న్యాయవాది ఏసుబాబు, గల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: ప్లాస్టిక్ బ్యాగ్‌లతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య డెంటల్ క్లీనిక్‌లో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా ప్రజలకు వస్త్ర సంచులను అందించారు.

కాకినాడ సిటీ: జగన్నాథపురంలోని అపెక్స్ హైస్కూల్‌లో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ సంస్థ బ్రాంచీలు, కాకినాడ వినియోగదారుల కోర్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ సంచుల వాడకంతో కలిగే హాని గురించి విద్యార్థులకు వివరించారు. సంస్థ అధ్యక్షురాలు సుశీ ఆదిత్య కుమార్, సత్యవాణి, రమాదేవి, నవ్య, పాఠశాల ప్రిన్సిపల్ బేగ్ పాల్గొన్నారు. వినియోగదారుల కోర్టులో అధ్యక్షుడు జస్టిస్ సీహెచ్ వసంతకుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పర్యావరణ సంరక్షకులు, వినియోగదారులు ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ మెంబర్, మైత్రేయి అధ్యక్షులు సుశీ పలు తీర్మానాలు చేశారు.

'జగనన్న సురక్ష'కు అనూహ్య స్పందన

- ఉచితంగా 11 రకాల సేవలు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. జగన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కాకినాడ అర్బన్ పరిధి సచివాలయం-1బి వైద్య నగర్‌కు సంబంధించి రమణయ్యపేట కార్పొరేషన్ కల్యాణ మండపం, చీడిగ, కొవ్వూరు గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన పాల్గొని ప్రజలకు వివిధ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు కావాల్సిన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసేందుకు జగన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలుత షెడ్యూల్ ప్రకారం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి సర్వే చేసి కావాల్సిన సేవలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకుని టోకెన్ ఐడీ నంబరు ఇస్తారన్నారు. వారం రోజుల వ్యవస్థలో సంబంధించిన సర్టిఫికెట్లను గ్రామ, వార్డు సభల్లో పంపిణీ చేస్తామన్నారు. కుల, ఆదాయ, నివాస, మరణ, జనన తదితర సర్టిఫికెట్లతో పాటు రేషన్‌కార్డులు, పేర్ల మార్పులు, తొలగింపులు, చేర్పులు తదితర వంటి సేవలు పొందవచ్చన్నారు. ఆధార్‌కు సంబంధించిన సేవలూ అందిస్తారన్నారు. కాకినాడ అర్బన్ సచివాలయం- 1బి పరిధిలో 1,358 కుటుంబాలకు 266 మంది దరఖాస్తు చేసుకోవడంతో వారిలో 255 సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, డివిజన్ నాయకులు వాసురెడ్డి సూరిబాబు, నాగు, సత్తిబాబు పాల్గొన్నారు. చీడిగలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 392 దరఖాస్తులకు 389 పత్రాలు అందజేశారు. కొవ్వూరులో 113 దరఖాస్తులకు అన్ని సర్టిఫికెట్లను అందించారు. జెడ్పీటీసీ సురుకుర్తి రామకృష్ణ, ఎంపీడీఓ కర్రే స్వప్న, తహసీల్దార్ మురారీ, కొప్పిశెట్టి గణేష్, డి.అరుణ, పిల్లి చక్రరావు, పల్లంరాజు, రమేష్ పాల్గొన్నారు.



చీడిగలో అర్హులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

జగనన్న సురక్షతో మేలు

కరప: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తెలిపారు. స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో సోమవారం గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మద్దూరి భవానీ, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, మద్దూరి భాస్కర్, ఆర్ఐ పేపకాయల మాచరావు తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనాలు

కాకినాడ: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. సోమవారం వివిధ ప్రాంతాల్లో జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. 15, 1, 2 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శివప్రసన్న మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడమే సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల మాట్లాడుతూ 371 మందికి టోకెన్లు జారీ చేసి సేవలందించామన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కౌడ చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

ఎస్వీ రంగారావు చిత్రసీమకు ఆదర్శం

- జయంతి సభలో ఎమ్మెల్యే కన్నబాబు
- కళాకారులకు సత్కారాలు

కాకినాడ రూరల్: విశ్వనట చక్రవర్తి, మహానటుడు సామర్ల వెంకట రంగారావు (ఎస్వీ రంగారావు) చిత్రసీమకు ఆదర్శనీయుడని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఎస్వీఆర్ జయంతి ఉత్సవాన్ని కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ రంగారావు స్మారక కళావేదిక, కురసాల కల్యాణకృష్ణ యూత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్వీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థల కళాకారులు మణిబాల, వెంకటేష్‌నాయుడు, కాటమరెడ్డి, భానుమతి, పద్మనాభం తదితరులను సన్మానించారు. కన్నబాబు మాట్లాడుతూ త్వరలో కాకినాడలో కళాకారులకు గుర్తింపు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపడతామన్నారు. గతంలోనూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, సినీనటుడు చిరంజీవి చేతుల మీదుగా నాగమల్లితోట జంక్షన్‌లో ఎస్వీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరింపజేశామన్నారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ బసవా ప్రభాకరరావు, వినాయక మాధవరావు, వెంకటేష్‌నాయుడు, కర్నాసుల సత్యనారాయణ, దామిశెట్టి శ్రీనివాసు, ఐ.శ్రీను, నాగబాబు, జమ్ములమడక నాగమణి పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: ఏ పాత్రలోనైనా అలవోకగా నటించి మెప్పించే సహజ నటుడు ఎస్వీ రంగారావు అని సినీనటుడు కాటమరెడ్డి అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు జయంతిని నిర్వహించారు. వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, త్రిమూర్తులు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు విగ్రహానికి వైద్యులు లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్, అడ్డాల సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.



రమణయ్యపేటలో ఎస్వీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సినీ నటుడు కాటమరెడ్డి

ఉదయం ఉష్ణతాపం.. మధ్యాహ్నం వర్షం

కరప: మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఒకటో డివిజన్ పరిధి బోట్‌క్లబ్ ఉద్యావనంలో వాకింగ్ ట్రాక్‌పై కొద్దిపాటి చినుకులకే నీరు వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాకర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



బోట్‌క్లబ్ ఉద్యావనంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో 190 కేడర్లలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో కలెక్టర్, ఇతర అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. సోమవారం స్పందన వేదికగా సంఘ ప్రతినిధులు డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌ను కలసి సమస్యలు వివరించారు. నేకూరి శిరీష, నాగం వందన, మాకే వెంకట లక్ష్మి ఉన్నారు.